సాక్షి రంగారెడ్డి

బుధవారం ၊ 29 ၊ నవంబర్ ၊ 2023

మద్యం నిల్వలపై నిఘా

షాద్‌నగర్‌రూరల్: అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా మద్యం అక్రమ నిల్వలపై గట్టి నిఘా ఏర్పాటు చేసినట్టు ఎక్సైజ్ సీఐ అంజనీకుమార్ మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటినుంచి సుమారు 140 కేసులను నమోదు చేయడం జరిగిందని, రూ. 82 లక్షల మద్యం, రూ.32లక్షల కల్లును సీజ్ చేసినట్టు పేర్కొన్నారు.



షాద్‌నగర్ రూరల్: జేసీబీలపైకెక్కి ప్రచారం చేస్తున్న షాద్‌నగర్ బీజేపీ నాయకులు

న్యూస్‌రీల్

30న వేతనంతో కూడిన సెలవు

ఇబ్రహీంపట్నం రూరల్: పోలింగ్ సందర్భం గా ఈ నెల 30న ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ప్రభుత్వం వేతనంతో కూడిన సెలవుదినంగా ప్రకటించిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతిహోళికేరి తెలిపారు. గురు వారం అన్ని ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలకు పరిశ్రమలకు వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రకటించారని చెప్పారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ కేంద్రాలుగా, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లుగా వినియోగిస్తున్న విద్యాసంస్థలు, ప్రభుత్వ సంస్థలకు ఈ నెల 29న కూడాసెలవుదినంగా ప్రకటిస్తూ స్థానికంగా ఉత్తర్వులు జారీ చేశామన్నారు.

రెండు రోజుల ముందు ఓటరు గుర్తింపు కార్డులు

పంపిణీ చేయలేక సిబ్బంది తంటాలు

తుర్కయంజాల్: ఎన్నికలకు రెండురోజులు గడువుండగా ఓటరు గుర్తింపు కార్డులు వందల సంఖ్యలో పోస్టల్ శాఖ ద్వారా వచ్చిప డ్డాయి. దీంతో అధికారులు వాటిని పంపిణీ చేసేందుకు నానా తిప్పలు పడుతున్నారు. తుర్కయంజాల్ పురపాలక సంఘం పరి ధిలోని ఒక్క ఇంజాపూర్‌లోనే 1,047 కార్డులు రావడంతో వాటిని ఎలా ఓటర్లకు చేర వేయాలో తెలియక తల పట్టుకుంటున్నారు. కాలనీల వారీగా మున్సిపల్ సిబ్బంది వెతికి పక్కన పెడుతున్నారు. సిబ్బందిని నియమిం చి, వీలైనంత వరకు పంపిణీ చేస్తామని తెలిపారు.

సప్పుడు బంద్

మూగబోయిన మైకులు

- ప్రచారపర్వానికి తెర
- పంపకాలతో ఎర!
- భారీగా ఓటుకు నోటు
- మందు.. విందు
- పోలింగ్ బూత్‌ల వారీగా 'ప్రత్యేక' ఏర్పాట్లు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికల ప్రచారానికి మంగ ళవారంతో తెరపడింది. నిన్న మొన్నటి వరకు హోరెత్తించిన మైకులు ఒక్కసారిగా మూగబో యాయి. విందులు, వినోదాలతో కళకళలాడిన ఫంక్షన్‌హాళ్లు, హోటళ్ల సాయంత్రం నుంచే వెలవెల బోయాయి. ముఖ్య కార్యకర్తల సమావేశాలు, బహి రంగ సభలు ,రోడ్‌షోలు, ఆత్మీయ సమ్మేళనాలు, ఇంటింటి ప్రచారాలతో బిజీగా కన్పించిన అభ్యర్థులు పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి సారిం చారు. ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని సర్వశక్తులు ఒడ్డుతున్నారు. పోలింగ్ బూతుల వారీగా ప్రత్యేక ఏజెంట్లను నియమించుకుని పార్టీకి పెద్దగా పట్టు లేని ప్రాంతాలపై ఫోక స్ పెట్టారు. ఆయా ప్రాంతాల్లోని ఓటర్లకు మద్యం, నగదును ఎరగా చూపుతున్నారు. పట్టణ సెగ్మెంట్లలో ఓటుకు రూ.2000 వరకు చెల్లిస్తున్నట్టు సమాచారం. గ్రామీణ నియోజకవ ర్గాల్లో ఇంటికి ఒక ఫుల్ బాటిల్, ఓటుకు రూ.1000 వరకు పంచుతు న్నట్టు తెలుస్తోంది. రిజర్వ్‌డ్ స్థానాల్లోని అభ్యర్థులు కూడా ఖర్చుకు ఏమాత్రం వెనుకాడటం లేదు.

నిఘా సంస్థల కళ్లుగప్పి

జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో మొత్తం 209 మంది అభ్యర్థులు పోటీపడుతు న్నారు. వీరిలో బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులతో పాటు బీఎస్పీ, ఇతర చిన్నా చితక పార్టీ అభ్య ర్థులు, స్వతంత్రులు ఉన్నారు. ముఖ్యం గా ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు హోరాహో రీగా తలపడుతున్నారు . ఇప్పటికే ఆయా నియోజ కవర్గాల్లో విస్తృత ప్రచారం నిర్వహి ంచారు. ఢిల్లీ నేతలను గల్లీకి పిలిపించి, వారితో బహిరంగ సభలు, రోడ్‌షోలు చేయించా రు. ఓటర్లను ఆకట్టుకునేం దుకు విశ్వ ప్రయత్నాలు చేశారు.

అభ్యర్థుల రోజు వారీ ఎన్ని కల ఖర్చు లను వైన్స్ వ్యాపారులు, పెట్రోల్ బంకుల నిర్వాహకులు, రియల్ ఎస్టేట్, ఇతర వ్యాపారులు సమకూర్చుతున్నారు. ఎన్నికల కమిషన్, నిఘా అధికారుల కళ్లుగ ప్పి.. ఈ పంపకాలకు తెరతీశారు. భద్రతా యంత్రాంగం కూడా మద్యం, నగదు ప్రవాహాన్ని నియంత్రించలేక పోతోంది. పోలీసులు ప్రధాన రహదారుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహ నాల్లో వచ్చి పోయే వారిని మాత్రమే చెక్ చేస్తు న్నారు. మిగిలిన వారిని వదిలేస్తున్నారు. పోలీస్ చెక్‌పోస్టులు ఉన్న ప్రాంతాలను వదిలేసి కాలి బాట మార్గంలో గమ్యస్థానాలకు చేరుకుం టున్నారు. వీరిలో కొంత మంది ప్రత్యర్థి పార్టీ కార్యకర్తలకు చేతికి చిక్కుతుండగా, మరికొంత మంది గుట్టుగా పనికాని చ్చేసి పోతున్నారు.

బయటి వ్యక్తులతో పంపకాలు

స్థానిక కేడర్‌తో నగదు, మద్యం పం పకాలు జరిపితే ప్రత్యర్థి పార్టీలకు దొరికి పోతామనే భయంతో మెజార్టీ అభ్యర్థులు తమ సంస్థల్లో పని చేసే ఉద్యోగులతో ఈ పని కానిచ్చేస్తున్నట్టు సమాచారం . పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్ల జాబితాను వారి చేతికిచ్చి నగదు పంపకాలకు తెరలేపారు. ఒక్కో ఓటరు ఇంటికి చేరుకుని పోలింగ్ స్లిప్పుతో పాటు నగదును చేతిలో పెడుతున్నారు. ఫలానా అభ్యర్థికే ఓటు వేయాల్సిందిగా సూచిస్తున్నారు. ఓటర్లు కూ డా ఇదే అవకాశంగా తీసుకుంటున్నారు. అభ్య ర్థుల బంధువులు, సొంతూళ్లకు చెందిన వారు ఆయా మండల కేంద్రాల్లోని ఫాంహౌసులు, లాడ్జీల్లో మ కాం వేశారు. నిజానికి సాయంత్రం 5 గంటల నుం చి ప్రచార కార్యక్రమాలపై నిషేధం అమల్లోకి వచ్చింది. 144 సెక్షన్ అమలులో ఉంటుంది. 48 గంటల సైలెన్స్ పీరియడ్ దృష్ట్యా స్థానికేతరులె వరూ ఆయా నియోజకవర్గాల్లో ఉండకూడదు. కానీ అభ్యర్థుల తరపు బంధువులు, స్నేహితులు, వ్యా పార భాగస్వాములు ఇవేవీ లెక్క చేయడం లేదు.



అవ్వ జర'గుర్తు'ంచుకో..

మొయినాబాద్: చిన్నషాపూర్‌లో ఓటు ఎలా వేయాలో నమునా ఈవీఎం ద్వారా వృద్ధులకు చూపిస్తూ ప్రచారం చేస్తున్న చేవెళ్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలె యాదయ్య




ఓటేస్తే ఆపన్న'హస్తం' అందిస్తాం

షాబాద్: సర్దార్‌నగర్ సంతలో కూరగాయలు అమ్ముతున్న వ్యాపారులను ఓటు వేయాలని వేడుకుంటున్న చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి పామెన భీంభరత్

పోలింగ్‌కు ఏర్పాట్లు

- జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాలు
- 3,453 పోలింగ్ కేంద్రాలు
- విధుల్లో 15,212 మంది సిబ్బంది
- పోలింగ్ స్టేషన్లకు ఈవీఎంలు



చేవెళ్లలోని ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: మరో కొన్ని గంటల్లో ఓటింగ్ ప్రక్రియ మొదలు కానుంది. జిల్లా ఎన్నికల అధి కారులు ఓటింగ్ కోసం సర్వం సిద్ధం చేశారు. ఇప్ప టికే నియోజకవర్గాల వారీగా పోలింగ్ బూత్‌లను ఎంపిక చేసి, సిబ్బందిని కూడా నియమించారు. జిల్లా వ్యాప్తంగా ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో 3,453 పోలింగ్ కేంద్రాలను ఎంపిక చేశారు. మొత్తం 35,23,219 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా 15,212 మంది విధులు నిర్వర్తించను న్నారు. ఇబ్రహీపట్నం, మహేశ్వరం నియోజక వర్గం పోలింగ్ సిబ్బందికి మంగల్‌పల్లి సమీపం లోని సీవీఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో వీవీప్యాట్‌లు, కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు అం దజేయనున్నారు. ఎల్బీనగర్ పోలింగ్ కేంద్రాలకు సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో అందజేయను న్నారు. చేవెళ్ల పోలింగ్ కేంద్రాలకు ఫరా ఇంజనీరిం గ్ కాలేజీ నుంచి డిస్ట్రిబ్యూషన్ చేయనున్నారు. శేరి లింగంపల్లి పోలింగ్ సిబ్బందికి గచ్చిబౌలి ఇం డోర్‌స్టేడియం నుంచి, షాద్‌నగర్ మినీస్టేడియం నుంచి షాద్‌నగర్ పోలింగ్ కేంద్రాలకు ఈవీఎం లను సరఫరా చేయనున్నారు. సీబీఎండీ కాలేజీ నుంచి కల్వకుర్తి పోలింగ్ బూత్‌లకు ఈవీఎంలను అందజేయనున్నారు. ఓటింగ్ తర్వాత ఆయా ఈవీ ఎంలను అదే ప్రాంతంలో ఎంపిక చేసిన కౌంటింగ్ కేంద్రాలకు తరలించనున్నారు. ఇందుకోసం జిల్లా ఎన్నికల సంఘం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది.

అప్రమత్తంగా ఉండాలి

ఎన్నికల నేపథ్యంలో ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, ఎం సీసీ, పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, కల్యాణ మండపాలు, హోటళ్లు, లాడ్జీల్లో తనిఖీ చేయాల్సిందిగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోళికేరి ఆదేశించారు. ఇప్పటి వరకు నియోజకవర్గాల్లో మకాం వేసిన స్థానికేతరులు వెం టనే ఆయా కేంద్రాలను వదిలి వెళ్లాల్సిందిగా కోరా రు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సెక్షన్ 126 (1)(బి) ఆర్ పి యాక్ట్ 1951 ప్రకారం ఒపీనియన్ పోల్, ఎగ్జిట్ పోల్స్ నిషేధమని స్పష్టం చేశారు. సాయంత్రం ఐదు గంటల నుంచి ఎన్నికలు ముగిసే వరకు జిల్లాలో మద్యం షాపులను మూసి వేయించి, డ్రైడేగా ప్రకటించడం జరిగిందన్నారు.

ఇదీ స్వరూపం

మొత్తం నియోజకవర్గాలు	8
పోలింగ్ బూతులు	3,53
మొత్తం ఓటర్లు	35,23,219
పురుషులు	18,22,366
మహిళలు	16,99,600
థర్డ్‌జెండర్స్	454
ఎన్ఆర్ఐలు	207
సర్వీసు ఓటర్లు	592
పోటీలో ఉన్న అభ్యర్థులు	209
పోలింగ్ సిబ్బంది	15,212
వీవీ ప్యాట్స్	5,389
కంట్రోల్ యూనిట్లు	5,483
బ్యాలెట్ యూనిట్లు	6,961
సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు	521

అభివృద్ధే ఎజెండా

SAKSHI INTERVIEW సాక్షి

- ఇప్పటికే నియోజకవర్గంలో ఎంతో చేశాం
- మహేశ్వరం రూపురేఖలు మార్చేశాం
- మరోసారి గెలిపిస్తే మరింతగా అభివృద్ధి
- 'సాక్షి'తో బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి సబితారెడ్డి



మహేశ్వరం: నియోజకవర్గ అభివృద్ధే తన అభిమత మని.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో ఇప్పటికే ఎంతో చేశామని.. మరోసారి ఆశీర్వదించి గెలిపిస్తే మరింతగా అభివృద్ధి చేస్తామని మహేశ్వరం బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు 'సాక్షి'తో మాట్లాడారు. ఇప్పటి వరకు నియోజకవర్గానికి చేసింది.. తిరిగి గెలిపిస్తే చేయబోయేది పంచుకున్నారు. అవి ఆమె మాటల్లోనే..

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

వేల కోట్ల నిధులతో నియోజకవర్గాన్ని అన్ని రం గాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దాను. గతంతో పోల్చితే బీఆర్‌ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ నాయకత్వం లో ఎంతో అభివృద్ధి జరిగింది. రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు, నూతన కళాశాలలు, పాఠ శాలలు, ప్రభుత్వ కార్యాలయాలతో పాటు పార్కుల రూపురేఖలు మార్చాం. సంక్షేమ పథ కాలు అర్హులందరికీ అందించాం. ఎంతో మందికి లబ్ధి చేకూర్చాం. నిత్యం ప్రజల మధ్యే ఉంటూ వారికోసం అహర్నిషలు పాటుపడ్డాం.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి

గడిచిన నాలుగున్నరేళ్లలో సాధరణ నిధులే కాకుం డా ప్రభుత్వం నుంచి సీఎం కేసీఆర్‌తో మాట్లాడి ప్రత్యేకంగా నిధులు వచ్చేలా చేశా. ప్రణాళికాబద్ధం గా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లాం. బీటీ, సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీరు, సాగునీరు వచ్చేలా చేశాం. చెరు వులు, కుంటలు, నాలాలను అభివృద్ధి చేసి కబ్జా కాకుండా చూశాం. ఎఫ్‌టీఎల్ హద్దులు గుర్తించి రక్ష ణగా కంచె ఏర్పాటు చేసి సుందరీకరణ చేపట్టాం. మీర్‌పేట్, బడంగ్‌పేట్ మున్సిపాలిటీల్లో వర్షం నీరు కాలనీలకు రాకుండా ట్రంక్‌లైన్ ఏర్పాటు చేశాం.

ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చాం

సీఎం కేసీఆర్ నాయకత్వంలో విద్యా సంస్థలు నెల కొల్పి ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దాం. మహేశ్వ రం, బడంగ్‌పేట్‌లో ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు, మహేశ్వరంలో డైట్ కాలేజీ, గిరిజన గురుకుల కాలే జీ, హస్టల్, బీసీ డిగ్రీ కాలేజీ, పాలిటెక్నిక్ కాలేజీ, ప్రభుత్వ పాఠశాల, మోడల్ స్కూల్ అధునికీకరణ చేపట్టాం. అదనపు భవనాల నిర్మాణంతో పాటు కందుకూరులో రూ.176 కోట్లతో మెడికల్, లా కాలేజీలు మంజూరయ్యాయి. నియోజకవర్గ కేం ద్రంలో రూ.6 కోట్లతో 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రి నూతన భవన నిర్మాణం చేపట్టాం. నియోజకవర్గం లోని సుమారు 84 కులాలకు ఆత్మీయ భవనాలు, భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించి శంకు స్థాపన చేశాం.

మరో హైటెక్ సిటీగా మారుస్తా

మహేశ్వరం నగరానికి అతి చేరువలో ఉంది. ఈ ప్రాంతంలో భారీ పరిశ్రమలు ఏర్పాటు చేసి మరో హైటెక్ సిటీగా మారుస్తాం. ఇప్పటికే రావిర్యా, శ్రీన గర్, మహేశ్వరంలో ఎన్నో పరిశ్రమలు ఏర్పాట య్యేలా చేసి.. ఎంతో మందికి ఉపాధి అవకాశాలు కల్పించేలా కృషి చేశాం. భవిష్యత్తులో మరిన్ని ఏర్పాటు చేయించి పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తాం.

ప్రతిపక్షాల ఉచ్చులో పడొద్దు

నియోజకవర్గంలో అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ బీఆర్‌ఎస్‌ను అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. ఓటర్లు ఈ విషయాన్ని గ్రహించి ప్రతిపక్షాల ఉచ్చులో పడకుండా పని చేసే అభ్యర్థిని గెలిపించండి. మూడో సారి గెలిపిస్తే ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఆదర్శ నియోజ కవర్గంగా తీర్చిదిద్దుతా. ఈ ఎన్నికల్లో తనని గెలిపిం చి ఆదరిస్తారని ఆశిస్తున్నాను.



వేయండి ఓటు.. అసెంబ్లీలో కల్పించండి చోటు

మహేశ్వరం: ఓటు వేయాలని మహిళలను అభ్యర్థిస్తున్న మహేశ్వరం బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్



విజయ తిలకం

షాద్‌నగర్ రూరల్: షాద్‌నగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి అంజయ్యయాదవ్‌కు తిలకం దిద్దుతున్న మహిళ

ఆఖరి రోజు.. జోరు

- ప్రచారాలతో హోరెత్తించిన అభ్యర్థులు
- పోటాపోటీగా ర్యాలీలు.. రోడ్‌షోలు
- ఇంటింటికీ తిరిగిన పార్టీ శ్రేణులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికల ప్రచారంలోభాగంగా ఆఖరి రోజు మంగళవారం అభ్యర్థులు హోరెత్తిం చారు. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతం త్రులు విస్తృత ప్రచారం నిర్వహించారు. తమకే ఓటు వేసి గెలిపించాల్సిందిగా ఓటర్లను అభ్యర్థిం చారు. ఇ ప్పటికే గడపగడపకూ ఒకటికి రెండు సార్లు తిరిగిన అభ్యర్థులు.. ప్రచారం మరో గంటలో ముగుస్తుందనగా ఉధృతం చేశారు. నియోజకవర్గ కేంద్రాల్లో భారీ ర్యాలీలు, రోడ్ షోలు నిర్వహిం చారు. ప్రధాన పార్టీల అభ్యర్థులంతా ఒకేసారి రోడ్డె క్కడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపో యాయి. సాయంత్రం నాలుగు గంటల సమయం లో విద్యాసంస్థల నుంచి విద్యార్థులు బయటికి రావడం, స్కూలు, కాలేజీ వాహనాలన్నీ ట్రాఫిక్‌లో చిక్కుకు పోవాల్సి వచ్చింది.

హేమాహేమీలు

నిజానికి ఎన్నికల నోటిఫికేషన్‌కు నెల రోజుల ముం దు నుంచే ఆశావహులు ప్రచారాన్ని ప్రారంభిం చారు. పార్టీ టికెట్లు ఖరారు చేసి, బీఫాం చేతికిచ్చిన తర్వాత పూర్తిస్థాయిలో రంగంలోకి దిగారు. వ్యక్తిగ తంగా ఎవరికి వారు ఊరూరా ప్రచారం నిర్వహిస్తూనే.. బహిరంగ సభలు ఏర్పాటు చేసి పార్టీ ముఖ్య నేతలను నియోజకవర్గాలకు రప్పిం చారు. స్టార్ క్యాంపెయినర్లతో రోడ్‌షోలు నిర్వహిం చి ఓటర్లను ఆకట్టుకునేందుకు యత్నించారు. ఎన్ని కల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ ఇబ్రహీం పట్నం, చేవెళ్ల, షాద్‌నగర్, మహేశ్వరం నియోజకవ ర్గాల్లో ప్రజా ఆశీర్వాద సభలు నిర్వహించింది. సీఎం కేసీఆర్ స్వయంగా వచ్చి అభ్యర్థులను గెలిపించాల్సిందిగా ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఇక బీజేపీ 'విజయ సంకల్ప సభ'ల పేరుతో ప్రచారం చేపట్టింది. ప్రధాని నరేంద్రమోదీ మహేశ్వరం నియోజకవర్గంలో ప్రచారం నిర్వహించగా, హోం మంత్రి అమిత్‌షా రాజేంద్రనగర్, శేరిలింగంపల్లిలో పర్యటించారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఎల్బీనగర్, కల్వకుర్తి నియోజకవర్గాల్లో రోడ్‌షోలు నిర్వహించారు. ఇబ్రహీంపట్నంలో అస్సాం ముఖ్య మంత్రి హిమాంత్ బిష్వాశర్మ రోడ్‌షో చేశారు. షాద్ నగర్ కార్నర్ మీటింగ్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్, చేవెళ్ల, కల్వకుర్తి, మహేశ్వరం, ఎల్బీనగ ర్‌లో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే సభలు నిర్వహిం చారు. ఇబ్రహీంపట్నంలో విజయశాంతి రోడ్‌షోలో పాల్గొన్నారు. సీపీఎం తరపున ఇబ్రహీంపట్నంలో త్రిపుర మాజీ సీఎం మాణిక్ సర్కార్, జాతీయ నేతలు బీవీ రాఘవులు సహా పలువురు ప్రము ఖులు ప్రచారం చేపట్టారు. పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డారు.

చివరి రోజు రోడ్‌షోలు.. బైక్‌ర్యాలీలు..

- ఇబ్రహీంపట్నంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి మంచి రెడ్డి కిషన్‌రెడ్డి రోడ్ షో నిర్వహించారు.
- షాద్‌నగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి వీర్లపల్లి శం కర్, బీఆర్‌ఎస్ అభ్యర్థి అంజయ్య యాదవ్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి పాల మూరు విష్ణువర్ధన్‌రెడ్డి రోడ్‌షోలు చేశారు.
- చేవెళ్లలో కాంగ్రెస్ అభ్యర్థి భీం భరత్ రోడ్ షో నిర్వహించారు. బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థులు నియోజకవర్గంలోని మిగిలిన గ్రామాల్లో పర్యటించి తమకే ఓటు వేయాలని అభ్యర్థిం చారు.
- కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి మహే శ్వరంలో, బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ మహేశ్వరం, కందుకూరు మండ లాల్లో రోడ్‌షోలు, బైక్ ర్యాలీలు నిర్వహిం చారు.
- కల్వకుర్తిలో బీఆర్‌ఎస్ అభ్యర్థి జైపాల్ యాదవ్, కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయ ణరెడ్డి ఆమనగల్లులో బైక్ ర్యాలీ నిర్వహిం చగా, బీజేపీ అభ్యర్థి ఆచారి ఇంటింటి ప్రచా రంలో మునిగిపోయారు.
- ఎల్బీనగర్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సహా కాంగ్రెస్ అభ్యర్థి మధు యాష్కీ గౌడ్, బీజేపీ అభ్యర్థి సామరంగారెడ్డి డివిజన్ల వారీగా ఎక్కడిక్కడే బైక్ ర్యాలీల్లో పాల్గొన్నారు.
- రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి అభ్యర్థులు సైతం భారీ బైక్ ర్యాలీలు నిర్వహించారు.



ప్రచారవేళ.. అభినందన మాల

షాద్‌నగర్ రూరల్: గజమాలతో షాద్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి వీర్లపల్లి శంకర్‌ను సత్కరిస్తున్న కార్యకర్తలు, అభిమానులు

ఆశీర్వదించండి.. అండగా ఉంటా

కాంగ్రెస్ చేవెళ్ల అభ్యర్థి భీంభరత్



కాంగ్రెస్‌లో చేరుతున్న కృష్ణారెడ్డి తదితరులు

మొయినాబాద్ రూరల్: నియోజకవర్గ ఓటర్లు తనను ఆదరించి హస్తం గుర్తుకు ఓటేసి ఆశీర్వదించాలని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అభ్యర్థి పామెన భీంభరత్ కోరారు. మంగళవారం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దారెడ్డి కృష్ణారెడ్డి పలువురు నాయకులతో కలిసి భీంభరత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. యన వారికి పార్టీ కండువాకప్పి స్వాగతించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తనను అసెంబ్లీకి పంపిస్తే ఆరు గ్యారెంటీల అమలు చేయిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు షాబాద్ దర్శన్, మండల అధ్యక్షుడు మాణయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మాధవరెడ్డి, పీసీసీ ఫిషర్‌మెన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు తలారి భిక్షపతి ముదిరాజ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందికి పోలింగ్ కేంద్రాల కేటాయింపు

మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

సాక్షి,రంగారెడ్డి జిల్లా: ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా మంగళవారం పోలింగ్ సిబ్బంది మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోళికేరి థర్డ్ ర్యాండమైజెషన్ ప్రక్రియ నిర్వహించారు. సాధారణ పరిశీలకులు చంద్రకాంత్ కృష్ణా రావు డాంగే(ఐఏఎస్), నినమ(ఐఏఎస్), రామ్ కుమార్(ఐఏఎస్), తైతలంగ్ పమేయ(ఐఏఎస్)లు ర్యాండమైజేషన్‌ను పరిశీలించారు. అనంతరం ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, ఓపీఓలతో కూడిన బృందాలకు పోలింగ్ కేంద్రాలు కేటాయించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 3,453 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, 15,212 సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. 20 శాతం రిజర్వు సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు. ప్రతి నియోజకవర్గం పరిధిలో పోలింగ్ నిర్వహణకు కోసం ప్రత్యేకంగా ఐదు పోలింగ్ కేంద్రాల చొప్పున మహిళా బృందాలను, ఒక దివ్యాంగుల బృందం, ఒక యువతతో కూడిన పోలింగ్ బృందాలను ఎంపిక చేయడం జరిగిందని వివరించారు. ఈ సందర్భంగా మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజెషన్ ప్రక్రియను కూడా పూర్తి చేశారు. సమావేశంలో జిల్లా మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి రాజేశ్వర్ రెడ్డి, ఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాసిటీ రద్దు.. భూములు వాపస్

కాంగ్రెస్ ఇబ్రహీంపట్నం అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి



మాట్లాడుతున్న మల్‌రెడ్డి రంగారెడ్డి


ఇబ్రహీంపట్నం: తనను అసెంబ్లీకి పంపి.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఫార్మాసిటీ, మైనింగ్ జోన్ రద్దుతో పాటుగా రైతుల భూములు వాపస్ ఇస్తామని పార్టీ ఇబ్రహీంపట్నం అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫార్మాసిటీ రద్దును మేనిఫెస్టోలోనే పెట్టామని వివరించారు. రైతులకు ప్రభుత్వం ఇచ్చిన పరిహారం తిరిగి ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. నియోజకవర్గంలోని భూములు తీసుకుని ఏర్పాటు చసిన ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో 25శాతం ఉద్యోగాలు స్థానిక నిరుద్యోగులకే దక్కేలా చర్యలు తీసుకుంటామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాల్లోనూ కమీషన్లు తీసుకుని వారి అనుచరులకే అమలు చేశారని ఆరోపించారు. ఆరుగ్యారెంటీల అమలు చేస్తానని ప్రమాణం చేశానని గుర్తు చేశారు. నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ స్రవంతి, మాజీ సర్పంచ్ లక్ష్మయ్య, పార్టీ నాయకులు ఈసీ శేఖర్‌గౌడ్, గురునాథ్‌రెడ్డి, పాండురంగా రెడ్డి, సింహారెడ్డి, రమేశ్, డబ్బీకార్ శ్రీనివాస్, జగదీశ్‌యాదవ్, శంకర్‌గౌడ్, ఆనంద్, రమేష్‌గౌడ్, గౌస్, పాండు, శ్యాం, సీపీఐ నాయకులు నర్సింహ, టీడీపీ నాయకులు రవీందర్ పాల్గొన్నారు.

36 గంటలు..!

- నేటి ఉదయం నుంచి రేపు రాత్రి వరకు అలర్ట్
- అత్యంత అప్రమత్తంగా నగర పోలీసు విభాగం

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కీలక ఘట్టమైన పోలింగ్ సమీపిస్తుండటంతో నగర పోలీసు విభాగం అప్రమత్తమైంది. బుధవారం ఉదయం నుంచి గురువారం రాత్రి వరకు ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ అత్యంత అప్రమత్తంగా ఉండనున్నారు. ఈవీఎంలు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి బయటకు వెళ్లి మళ్లీ స్ట్రాంగ్ రూమ్స్‌కు చేరే వరకు ఎక్కడిక్కడ ప్రత్యేక బందోబస్తు, భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు. వీటిని నగర పోలీసు కమిషనర్ సందీప్ శాండిల్య మంగళవారం తన కార్యాలయం నుంచి సమీక్షించారు. నగర వ్యాప్తంగా 144వ సెక్షన్, నిషేధాజ్ఞలు విధిస్తూ కొత్వాల్ ఉత్తర్వులు జారీ చేశారు. నగరంలోని 15 ప్రాంతాల్లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం నుంచి వీటి వద్ద ఈవీఎంల పంపిణీ ప్రారంభం కానుంది. సాయంత్రానికి ఈవీఎం బాక్సులు పోలింగ్ కేంద్రాలకు చేరతాయి. ఆపై గురువారం రాత్రి పోలింగ్ ముగిసిన తర్వాత డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో ఉన్న స్ట్రాంగ్ రూమ్స్‌కు ఈవీఎంలను తరలిస్తారు. ఈ నేపథ్యంలోనే నగర పోలీసు విభాగం ప్రత్యేక బందోబస్తు, భద్రత ఏర్పాట్లు చేస్తోంది. బుధవారం ఉదయం నుంచి గురువారం రాత్రి వరకు సిబ్బంది, అధికారులు నిర్విరామంగా విధుల్లో ఉండనున్నారు. కీలక ప్రాంతాల్లో విధులు నిర్వర్తించే వారికి మాత్రం రిలీవర్ సిస్టం ఏర్పాటు చేస్తున్నారు. దీని ప్రకారం నిర్ణీత సమయం తర్వాత ఆ ప్రాంతంలో కొత్త వాళ్ళు వస్తూ రోటేషన్ విధానంలో పని చేస్తారు. నగదు, మద్యం సహా ఇతర వస్తువులు పంపిణీ, ఓటర్ల తరలింపు పైనా నిఘా వేసి ఉంచుతున్నారు. నగర కమిషనరేట్‌లో ఉన్న 7 జోన్లలోనూ అధికారులు కేంద్ర బలగాలతో కలిసి ఫ్లాగ్‌మార్చ్‌లు ముమ్మరం చేశారు. పోలింగ్ కేంద్రాలను 200 మీటర్ల పరిధిలో 144వ సెక్షన్ విధిస్తూ కొత్వాల్ ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం రాత్రి 8 గంటల వరకు ఇవి అమలులో ఉండనున్నాయి. వీటికి తోడు నగర వ్యాప్తంగా నిషేధాజ్ఞలు విధించారు. వీటి ప్రకారం నలుగురి కంటే ఎక్కువ మంది ఒకేచోట గుమిగూడటం, జెండాలతో సహా ఎలాంటి కర్రలు తదితరాలు కలిగి ఉండటం నిషేధం.

ప్రలోభాల పర్వం



- ప్రణాళికతో పంపకాలు
- సామాజికవర్గాల వారీగా కలుస్తున్న నేతలు
- ఓటర్లను ఆకర్షించేందుకు పాట్లు

షాబాద్: గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు ప్రణాళికలు రూపొందించుకున్నారు. అనుచరగనాన్ని రంగంలోకి దింపి ఓటర్లను ఆకర్షించేందుకు యత్నిస్తున్నారు. సామాజికవర్గాల వారీగా కలుస్తూ హామీలిస్తూ.. గెలుపునకు సహకరించాలని కోరుతున్నారు. కుల పెద్దలతో రహస్యంగా మంతనాలు జరుపుతున్నారు. అన్ని సామాజిక వర్గాల మద్దతుంటే విజయం నల్లేరు మీద నడకలా ఉంటుందని భావిస్తున్నారు. కుల సంఘాల వారీగా ఓటర్లను గుర్తించేందుకు ప్రత్యేకంగా టీంలను ఏర్పాటు చేసుకున్నారు. గ్రామాలకు వెళ్లి ఓట్లు అడిగే సమయం లేకపోవడంతో ప్రధాన గ్రామాలపై దృష్టి సారించారు.

కుల పెద్దలతో సంప్రదింపులు

ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు కులాలు, మతాల వారీగా ఓటర్లను గుర్తించి ఆయా వర్గాలకు చెందిన పెద్దలతో సంప్రదింపులు చేస్తున్నారు. సమయం దొరికినప్పుడల్లా ఫోన్లలో వారిని ఆప్యాయంగా పలుకరిస్తూ విజయానికి సహకరించాలని కోరుతున్నారు. ఇదే సమయంలో స్థానిక సమస్యలు, భవిష్యత్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ప్రస్తావించి.. గెలిచిన వెంటనే పరిష్కరిస్తామని హామీలిస్తున్నారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ఎక్కువ ఓట్లు కలిగి ఉన్న సామాజికవర్గాన్ని గుర్తించి వారి మద్దతునుకూడగట్టుకుంటున్నారు. నియోజకవర్గంలో 40 నుంచి 45 శాతం ఓటర్ల మద్దతును కూడగడితే విజయం తథ్యమనే ధీమాలో అభ్యర్థులున్నారు.

రెండు వైపులా వారే...

పోటీలో ఉన్న అభ్యర్థులు ఎవరిని నమ్మాలో? ఎవరిని దూరంగా ఉంచాలో అర్థం కాక తల పట్టుకుంటున్నారు. దీనికి కారణం లేకపోలేదు. ఎందుకంటే ఉదయం ఓ అభ్యర్థి ప్రచారంలో కనిపిస్తున్న వ్యక్తులు చీకటి కాగానే మరో అభ్యర్థి శిబిరంలో ప్రత్యక్షమవుతున్నారు. తమకే ఓట్లు వేయిస్తామని హామీలిస్తూ.. మందు, విందు పార్టీల్లో మునిగి తేలుతున్నారు. ఒక్కరుగా వెళ్లకుండా కొంత మందిని పోగేసుకొని మరీ వెళ్తున్నారు. మరికొందరు ఇప్పటికే ఫిరాయింపులకు పాల్పడిన వారి పక్షం వైపు చక్రం తిప్పుతుండడంతో అభ్యర్థులు గందరగోళంలో పడ్డారు.

సంక్షేమానికి 'కారు'కే ఓటేయండి

బీఆర్ఎస్ చేవెళ్ల అభ్యర్థి కాలె యాదయ్య



ప్రజలకు అభివాదం చేస్తున్న కాలె యాదయ్య

మొయినాబాద్: ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే కారుగుర్తుకు ఓటేయాలని బీఆర్ఎస్ చేవెళ్ల అభ్యర్థి కాలె యాదయ్య కోరారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని అమీర్‌గూడ, చిన్నషాపూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలు ప్రతీ ఇంటికి అందాయని.. పథకాలన్నీ కొనసాగలంటే మరోసారి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో పార్టీ రాష్ట్ర నాయకుడు అనంతరెడ్డి, సీనియర్ నాయకుడు నర్సింహారెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మాణిక్‌రెడ్డి, నాయకులు జయవంత్, కృష్ణారెడ్డి, రవియాదవ్, ప్రవీణ్, సత్తిరెడ్డి, నర్సింహారెడ్డి, నాగరాజు, సురేందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మరోసారి ఆశీర్వదించండి

మొయినాబాద్‌రూరల్: కారు గుర్తుకు ఓటేసి తనను మరో సారి ఆశీర్వదించాలని బీఆర్ఎస్ చేవెళ్ల అభ్యర్థి కాలె యాదయ్య అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని అజీజ్‌నగర్‌లో పార్టీ గ్రామ అధ్యక్షుడు మల్లారెడ్డి ఆధ్వర్యంలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల అభివృద్ధిని చూసి మరో మారు బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలని కోరారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అజీజ్‌నగర్‌లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల స్థలాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అనంతరెడ్డి, జిల్లా నాయకులు మాణిక్‌రెడ్డి, సర్పంచ్ సంధ్య, నాయకులు మల్లారెడ్డి, నర్సింహారెడ్డి, సత్తయ్య, నర్సింహాచారి, రవియాదవ్, జగన్‌మోహన్‌రెడ్డి, నర్సింహగౌడ్, మాణిక్, డేవిడ్, పోచయ్య పాల్గొన్నారు.

ఓటు చాలెంజ్!

- ఓటు వేశాక సెల్ఫీ దిగి వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు
- ఓటర్లలో ఉత్సాహం నింపేలా వినూత్న కార్యక్రమాలు
- పోలింగ్ శాతం పెంచేందుకు కాలనీ సంఘాల చొరవ

సాక్షి, సిటీబ్యూరో: గ్రీన్ చాలెంజ్, బకెట్ చాలెంజ్ తరహాలోనే ఓటు చాలెంజ్‌కు కాలనీ సంఘాలు తెరలేపాయి. గ్రేటర్‌లో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు, యువ ఓటర్లలో చైతన్యం నింపేందుకు యునైటెడ్ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ (యూ–ఎఫ్ఈఆర్‌డబ్ల్యూఏఎస్) వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ప్రౌడ్ ఓటరు, ఫ్యామిలీతో సెల్ఫీ..అనే కార్యక్రమాలను చేపడుతున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి బీటీ శ్రీనివాస్ తెలిపారు. కుటుంబంతో కలిసి ఉదయమే ఓటు వేసి, సిరా చుక్కను చూపిస్తూ సెల్ఫీ దిగాలని, ఆయా ఫొటోలను కాలనీ సంఘాల వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేయాలని సూచించారు. కాలనీలో ఇతరులకు ఓటు వేయాలని చాలెంజ్ చేయాలని తెలిపారు.

డివిజన్ స్థాయిలో వాట్సాప్ గ్రూప్‌లు..

నగరంలోని 4,800 కాలనీల్లో పోలింగ్ శాతం తక్కువగా ఉన్న ప్రాంతాలను ఎంచుకొని డివిజన్ స్థాయిలో వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేశారు. ఈనెల 30న పోలింగ్ రోజు ఉదయమే ఓటేశాక కుటుంబ సభ్యులంతా కలిసి వేలిపై సిరా చుక్కను చూపిస్తూ సెల్ఫీ దిగి కాలనీ వాట్సాప్ గ్రూప్‌లలో పెట్టాలని అసోసియేషన్ ప్రతినిధులు సూచించారు. ఆ రోజు ఎలాంటి పనులున్నా వాయిదా వేసుకోవాలని, వేడుకలు ఉంటే సమయాన్ని సర్దుబాటు చేసుకోవాలని సూచించారు. పోలింగ్‌కు ముందురోజు కాలనీవాసులంతా బూత్ వరకు ఈవినింగ్ వాక్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ప్రధానంగా 40–55 శాతం మాత్రమే పోలింగ్ నమోదైన కాలనీల్లో ఈసారి 60 శాతం కంటే ఎక్కువ ఓటింగ్ జరగాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టారు.

చలో పల్లెటూరు

ఓటు వేసేందుకు సొంతూళ్లకు నగరవాసులు


సాక్షి, సిటీబ్యూరో: నగరంలో స్థిరపడి.. సొంత ఊరులో ఓటున్న వారు స్వగ్రామాల బాట పట్టారు. తమ ఓటుహక్కును అక్కడే వినియోగించుకునేందుకు చలో పల్లెటూరు అంటున్నారు. దీంతో నగరం నుంచి బస్సులు, రైళ్లలో రద్దీ పెరిగింది. కార్లు, టాటాఏస్ వంటి వాహనాలు, సొంత కార్లు, ట్యాక్సీలు, క్యాబ్‌లు, బైక్‌లపైనా సిటీ జనులు ఊరు బాట పట్టారు. దీంతో హైదరాబాద్ నుంచి వరంగల్, నల్లగొండ, కరీంనగర్, తదితర ప్రాంతాలకు వెళ్లే రహదారులపై వాహనాల రద్దీ పెరిగింది. గురువారం ఎన్నికలు జరగనున్న దృష్ట్యా రెండు రోజులు ముందే సొంత ఊరుకు చేరుకోవాలనే ఉద్దేశంతో చాలామంది మంగళవారం ఊళ్లకు తరలి వెళ్లారు. బుధ, గురువారాల్లోనూ ప్రయాణికుల రద్దీ ఎక్కువగానే ఉండే అవకాశం ఉంటుందని ఆర్టీసీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

కౌంటింగ్‌కు 14 టేబుళ్లు

సాక్షి, సిటీబ్యూరో: కౌంటింగ్ ప్రక్రియను కౌంటింగ్ అబ్జర్వర్లు సునిశితంగా పరిశీలించాలని జనరల్ అబ్జర్వర్ సమీర్ వర్మ సూచించారు. మంగళవారం కౌంటింగ్ అబ్జర్వర్ల శిక్షణ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ, ఫారం–17 సి ద్వారా అభ్యర్థుల ఓట్లను నమోదు చేయాలని తెలిపారు. హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రాస్ మాట్లాడుతూ కౌంటింగ్ రోజు అబ్జర్వర్లు పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌ను పరిశీలించి నమోదు చేసుకోవాలని తెలిపారు. ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌మీటర్ పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునే ఆర్మీ పోలీసుల క్యూ ఆర్ కోడ్‌ను కూడా పరిశీలించి నమోదు చేయాలని తెలిపారు. ఓట్ల లెక్కింపు కోసం కౌంటింగ్ రోజు 14 టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రతి రౌండ్ తర్వాత ర్యాండమ్‌గా కంట్రోల్ యూనిట్లను ఎంపిక చేసి అందులో నమోదైన ఓట్లు, ఫారం–17 సి పున:పరిశీలించడం జరుగుతుందని తెలిపారు.

మాటల్లేవ్.. మాట్లాడుకోవడాలే!

- ప్రచారానికి బైబై.. ఓట్ల వేటకు జై
- అగ్రనేతల పర్యటనలతో గ్రేటర్ ఉక్కిరిబిక్కిరి
- ప్రధాని మోదీ నుంచి స్మృతి ఇరానీ దాకా..
- రాహుల్‌గాంధీ నుంచి సిద్ధరామయ్య వరకు
- శివార్లలో సీఎం కేసీఆర్..
- నగరమంతటా మంత్రి కేటీఆర్
- హేమాహేమీల మాటల తూటాలు



సాక్షి, సిటీబ్యూరో: అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ముగిసింది. మైకులు మూగబోయాయి. ర్యాలీలు నిలిచిపోయాయి. రోడ్‌షోలు, బహిరంగసభలు ముగిసిపోయాయి. మాటల తూటాలు ఆగిపోయాయి. ఇక మిగిలింది ఒక్కరోజే. ఓట్లకు నోట్ల పంపిణీకి రహస్య మంతనాలు మొదలయ్యాయి. అవి గుంభనంగా ఎక్కడ జరగాలో అక్కడ గుట్టుగా జరుగుతున్నాయి. నగదు చేతులు మారుతోంది. కొన్ని చోట్ల పనుల హామీలు పొందినట్లు తెలుస్తోంది. ఈ ఎన్నికల్ని మూడు ప్రధాన పార్టీలు ప్రతిష్టాత్మకంగా, సవాల్‌గా తీసుకున్నాయి. గ్రేటర్ పరిధిలో మూడు జిల్లాలకు చెందిన 29 నియోజకవర్గాలతో పాటు విభిన్న జాతులు, సంస్కృతుల ప్రజలుండటంతో ఇక్కడ ఎక్కువ స్థానాల్లో గెలిస్తే రాష్ట్రమంతటా గెలిచేనట్లేననే అభిప్రాయంతో అన్నిపార్టీలూ రాజధాని నగరంపై ప్రత్యేక దృష్టి సారించాయి. దీంతో అన్ని పార్టీల అగ్రనేతల్ని ప్రచారంలోకి దింపడంతో ఒకరకంగా నగరం ఉక్కిరిబిక్కిరయ్యింది. వీవీఐపీల పర్యటనలతో, ట్రాఫిక్ మళ్లింపులతో కొన్ని ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. బీఆర్ఎస్‌కు ప్రత్యేకంగా జాతీయ నేతలు లేకపోవడంతో, కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు చుట్టబెట్టారు. సీఎం కేసీఆర్ పాల్గొనాల్సిన పరేడ్‌గ్రౌండ్స్ బహిరంగ సభ జరగలేదు. దానిద్వారా గ్రేటర్‌లోని అన్ని నియోజకవర్గాల అభ్యర్థుల తరపున ఒకేసారి ప్రచారం నిర్వహించాలనుకున్నారు. ఆ సభ ఆగిపోవడంతో కోర్‌సిటీలోని అభ్యర్థులకు మాత్రం కేసీఆర్ ప్రచారం నిర్వహించలేకపోయారు. ఉమ్మడి రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో జరిగిన సభల్లో పాల్గొన్నారు. మంత్రి కేటీఆర్ గ్రేటర్‌లోని అన్ని నియోజకవర్గాల్లోనూ రోడ్‌షోలు నిర్వహించారు. మెట్రో రైలు, హోటళ్లలో తిరిగారు. ప్రజలతో ముచ్చటించారు. వివిధ వర్గాలతో ప్రత్యేక సమావేశాల ద్వారా ప్రచారం చేశారు.

బీజేపీ అతిరథ మహారథులు

కేంద్రంలో అధికార పార్టీ బీజేపీ ప్రధానమంత్రితో సహా పలువురు కేంద్రమంత్రుల్ని రంగంలోకి దింపింది. పలువురు మంత్రులు వివిధ నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థుల తరపున సభలు, రోడ్‌షోల ద్వారా ప్రచారం చేశారు. ప్రధాని మోదీ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ నుంచి కాచిగూడ వరకు రోడ్‌షోలో పాల్గొన్నారు. మహేశ్వరం తుక్కుగూడలో బహిరంగ సభలో ప్రసంగించారు. కొద్ది వారాల ముందు పరేడ్‌గ్రౌండ్‌లో ×మాదిగల విశ్వరూపసభ×లో, ఎల్‌బీ స్టేడియంలో బీసీ డిక్లరేషన్ సభలోనూ పాల్గొన్నారు. హోం మంత్రి అమిత్‌షా ఖైరతాబాద్, అంబర్‌పేట, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్,ఉప్పల్, తదితర నియోజకవర్గాల్లో రోడ్‌షోల్లో పాల్గొన్నారు. రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ కంటోన్మెంట్, మేడ్చల్, కార్వాన్ నియోజకవర్గాల్లో, ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ జూబ్లీహిల్స్‌లో, నగరానికే చెందిన కిషన్‌రెడ్డి అంబర్‌పేటలో, మరో కేంద్రమంత్రి స్మృతిఇరానీ ఖైరతాబాద్ నియోజకవర్గంలో, తమిళనాడు పార్టీ అధ్యక్షుడు అన్నామలై శేరిలింగంపల్లి, సికింద్రాబాద్‌లలో రోడ్‌షోలతో పార్టీ శ్రేణుల్లో జోష్ నింపారు. యూపీ సీఎం ఆదిత్యనాథ్ యోగి ఎల్‌బీనగర్, గోషామహల్‌లలో, అసోం సీఎం హేమంత్‌విశ్వశర్మ మలక్‌పేట నియోజకవర్గంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ముషీరాబాద్, సనత్‌నగర్ నియోజకవర్గాల్లో తమ పార్టీ అభ్యర్థులకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మరో కేంద్రమంత్రి పీయూష్ గోయల్ తదితరులు గ్రేటర్‌లో బీజేపీ గెలుపు కోసం నగరానికి వచ్చారు.

కాంగ్రెస్ హేమాహేమీలు

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ముషీరాబాద్, నాంపల్లి, జూబ్లీహిల్స్, మల్కాజిగిరి నియోజకవర్గాల్లో పర్యటించారు. ప్రియాంక గాంధీ మల్కాజిగిరి తదితర ప్రాంతాల్లో, కర్నాటక సీఎం సిద్ధరామయ్య ముషీరాబాద్‌లో, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ముషీరాబాద్, సనత్‌నగర్‌లలో, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే ఎల్‌బీనగర్‌లో, విజయశాంతి సికింద్రాబాద్, కంటోన్మెంట్‌లలో కాంగ్రెస్ అభ్యర్థుల విజయం కోసం ప్రచారాలు చేశారు. రోడ్‌షోల్లో పాల్గొన్నారు. పరిసరాల్ని హోరెత్తించారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దాదాపుగా గ్రేటర్‌లోని అన్ని నియోజకవర్గాల్లో ప్రచారంలో పాల్గొన్నారు. రాహుల్‌గాంధీ నిరుద్యోగులతో కలిసి చిక్కడపల్లిలో చాయ్ తాగుతూ, బావర్చీ హోటల్‌లో ముచ్చట్లు పెడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులు, ఫుడ్‌డెలివరీ బాయ్స్, ఆటోవాలాలతో భేటీ అయ్యారు. వీరితోపాటు పలువురు ఏఐసీసీ నేతలు, పలువురు ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ముఖ్యనేతలు నగరంలో మకాం వేసి పార్టీ అభ్యర్థుల విజయం కోసం కృషి చేశారు.దీంతో ఆయాప్రధాన రహదారులతోపాటు గల్లీల్లోనూ సందడి నెలకొంది. ఒకరిపై మరొకరు పదునైన విమర్శలతో పరిసరాలు దద్దరిల్లేలా చేశారు.

ఓట్ల వేటలో..

ప్రచారం ముగియడంతో అన్నిపార్టీల్లోనూ పంపణీలపై దృష్టి సారించారు. ఓట్ల వేటలో బిజీగా మారారు. కాలనీ సంఘాలు, కుల, మహిళా సంఘాలతో కలిసి రహస్యంగా ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఇప్పటికే మద్యం బాటిళ్లు, నగదును పోగేసిన ద్వితీయశ్రేణి నేతలు వాటిని పంపిణీ చేస్తూ బిజీబిజీగా ఉన్నారు.. స్థానిక వ్యాపారులు, అనుచరులతో ఫోన్‌పే, గూగుల్ పే వంటి యూపీఐ ద్వారా నగదు పంపిణీ చేస్తున్నారు.

ఎవరు ఎక్కువిస్తే వాళ్లకే..

ఓటుకు రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు పార్టీలు డబ్బు పంపిణీ చేస్తున్నాయి. అన్ని పార్టీల దగ్గర డబ్బు తీసుకొని ఎవరు ఎక్కువ డబ్బు ఇస్తే వారికే ఓట్లు వేసేందుకు ఓటర్లు సిద్ధమైనట్లు తెలుస్తోంది. యువతులను ఆకట్టుకునేందుకు స్మార్ట్ వాచ్‌లు, ఎలక్ట్రిక్ స్కూటర్లు వంటి బహుమతులను సైతం పంపిణీ చేస్తున్నట్లు సమాచారం.